కాలుష్య కాసారం

- కవరు కాని నిషేధం
- అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిన అమలు
- మార్కెట్‌లో విచ్చలవిడిగా విక్రయాలు
- యథేచ్ఛగా వినియోగిస్తున్న జనం

ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి పెను ముప్పుగా తయారైంది. అతి చౌకగా, సునాయాసంగా వాడుకలోకి వచ్చిన ప్లాస్టిక్ సంచుల వినియోగం పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వివాహాది శుభకార్యాలతో పాటు, మానవుని నిత్య అవసరాల్లో ఈ ప్లాస్టిక్ సంచుల వినియోగం కీలకంగా మారిపోయింది. ప్రతి చిన్న అవసరానికి ప్లాస్టిక్ సంచులను వాడుతున్నారు. దీంతో పల్లె ప్రాంతాల్లోనూ ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ సంచులు విచ్చలవిడిగా పేరుకుపోతున్నాయి.


ఎటు చూసినా ప్లాస్టిక్ భూతమే..


ఇటీవల వరదల్లో కాలువలకు అడ్డు పడిన ప్లాస్టిక్ వ్యర్థాలు(ఫైల్)


మండల కేంద్రమైన కొత్తపల్లిలో ప్లాస్టిక్ చెత్త

పిఠాపురం: ప్లాస్టిక్ సంచుల వినియోగంపై నిషేధం విధించినప్పటికీ, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో నిషేధం నీరుగారుతోంది. కఠిన నిర్ణయాలతో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని పర్యావరణ వేత్తలు మొరపెట్టుకుంటున్నా.. పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నిత్యం టన్నులకొద్దీ ప్లాస్టిక్ సంచులు డంపింగ్ యార్డుకు చేరుతున్నాయి. సాధారణ చెత్తా చెదారం కొన్ని రోజులకు భూమిలో ఇంకిపోయి పర్యావరణానికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఉండేవి.

అయితే ప్లాస్టిక్ సంచులు మాత్రం ఏళ్ల తరబడి ఏ మాత్రం నశించకుండా, భూమిలో ఇంకిపోకుండా ఉండిపోతుండడంతో కాలుష్యం కారుమబ్బులా కమ్ముకొచ్చేస్తోంది. దీంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుండడంతో పాటు, పర్యావరణానికి పెను ముప్పుగా పరిణమించింది. దీనిపై ప్రభుత్వం నిషేధం విధించినట్టు ప్రకటనలు గుప్పిస్తున్నా, ఆచరణలో మాత్రం కార్యరూపం దాల్చడం లేదు.

15 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు

పిఠాపురం పట్టణ పరిధిలో సుమారు 70 వేల మంది జనాభా ఉండగా, నిత్యం 28 టన్నులకు పైగా చెత్త వెలువడుతోంది. పట్టణ ప్రజలతో పాటు, పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో ప్రతి రోజు సుమారు 50 టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతుండగా, అందులో 15 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి.

విచ్చలవిడిగా విక్రయాలు

పిఠాపురం విషయానికొస్తే, లక్షలాది మంది ప్రజలు ప్రతి రోజు వివిధ అవసరాల కోసం పట్టణానికి వచ్చి పోతుంటారు. తద్వారా ప్లాస్టిక్ సంచుల విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. పిఠాపురం పట్టణ పరిధిలో ప్రతిరోజు మూడు లక్షలకు పైగా ప్లాస్టిక్ సంచుల అమ్మకాలు జరుగుతున్నట్టు అంచనా. పట్టణ పరిధిలో 22కు పైగా హోల్‌సేల్ దుకాణాలు, మరో 120కి పైగా చిల్లర దుకాణాల్లో ప్లాస్టిక్ సంచులను విక్రయిస్తున్నారు. ప్లాస్టిక్ సంచులతో పాటు, ప్లాస్టిక్ గ్లాసుల వినియోగం ఎక్కువగా జరుగుతోంది. వీటిని నిషేధించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పటికీ, అమలు చేయడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు తయారు చేసే పరిశ్రమలకు మంజూరు ఉత్తర్వులు రాష్ట్ర స్థాయి అధికారులు ఇవ్వడంతో, ఆయా పరిశ్రమలు వాటిని యథేచ్ఛగా తయారు చేస్తున్నాయి. వాటిని తయారు చేసే పరిశ్రమలపై అధికారులు చర్యలు తీసుకోలేక, ప్రజలను వినియోగించకుండా చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజలు వినియోగించకపోతే.. పరిశ్రమలు వాటిని తయారు చేయడం మానివేస్తాయని అధికారులు యోచన విస్మయం కలిగిస్తోంది. వాటిని తయారు చేసే పరిశ్రమలపైనా చర్యలు తీసుకోవచ్చు కదా అని ప్రజలు ఎదురు ప్రశ్నిస్తున్నారు.

ప్రమాదమని తెలిసినా..

సామాన్యుల నుంచి ధనవంతుల వరకు ప్లాస్టిక్ కవర్లను వినియోగించడం సర్వసాధారణమైంది. ఇది ప్రమాదమని తెలిసినప్పటికీ, ప్రజల్లో చైతన్యం మాత్రం కనిపించడం లేదు. ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు వినియోగించి రోడ్లపై పారేయడం వల్ల అవి మట్టిలో కలవకపోవడంతో కాలుష్యాన్ని విపరీతంగా పెంచుతున్నాయి. దీనికి తోడు వినియోగదారులు మార్కెట్లలో కూరగాయలు, చేపలు, మాంసాలు వంటి వాటిని ప్లాస్టిక్ సంచుల్లో తీసుకొచ్చి డ్రైన్లలో పడవేస్తున్నారు. దీనికి కారణంగా డ్రైన్లలో మురికి నీరు ప్రవహించని పరిస్థితి ఏర్పడుతోంది. వరదల్లోను ప్లాస్టిక్ ప్రభావం ఎక్కువగా కనిపించింది. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుగా మారడంతో, కాలువలు పొంగి పొర్లి పంటలు దెబ్బతినే పరిస్థితి ఎదురైంది.

క్లుప్తంగా

నాణ్యత లోపిస్తే సహించేది లేదు


తిరుపతిలో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలిస్తున్న తహసీల్దార్

పెద్దాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో నాణ్యత లోపిస్తే సహించేది లేదని తహసీల్దార్ వెంకటలక్ష్మి హెచ్చరించారు. మండలంలోని తిరుపతి ఎస్సీ కాలనీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం తీరును మంగళవారం ఆమె సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ, గ్రామంలో మధ్యాహ్న భోజనం బాగోలేదంటూ వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. నాణ్యమైన భోజనం అందించేందుకు పథకం ఇంప్లిమెంట్ ఏజెన్సీలు కృషి చేయాలన్నారు. పర్యవేక్షణ లోపం లేకుండా చూడాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి ఉగ్గు భార్గవ్, వీఆర్‌ఓ వీరబాబు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కొత్తపల్లి: మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏఈఎస్‌డీఎస్ ప్రభాకరావు తెలిపారు. ఉప్పాడ సెంటర్‌లో ఫీడర్లకు విద్యుత్ మరమ్మతులు జరుగుతున్నట్టు చెప్పారు. దీంతో ఉప్పాడ, అమీనాబాద్, అమరవల్లి చెరువులు, నాగులపల్లి చెరువుల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం


పోటీలను ప్రారంభిస్తున్న సూరిబాబురాజు

పెద్దాపురం: క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు అన్నారు. స్థానిక మహారాణి కళాశాలలో మంగళవారం నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అండర్-15, 17 విభాగాల్లో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి ఎంఈఓ ప్రభాకరవర్మ అధ్యక్షత వహించారు. సూరిబాబురాజు మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి కనబర్చాలన్నారు. నైపుణ్యతలో ప్రతి ఒక్కరూ రాణించాలన్నారు. అనంతరం వాలీబాల్ ఆడి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, పీఈటీలు పాల్గొన్నారు.

గోరింటలో పొలం పిలుస్తోంది


గోరింటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఏఓ తదితరులు

పెద్దాపురం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని గోరింట గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పచ్చిపాల నేరీకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏఓ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటలో తెగులు, చీడలను వివరించారు. సామూహిక ఎలుకల నిర్మూలన. ఎరతయారీ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి డాక్టర్ ముస్తాబి మాట్లాడుతూ, ప్రస్తుత సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పశువులకు టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. ప్రతి రైతు పశువులకు బీమా చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎస్‌వీవీ ప్రసాద్, వ్యవసాయ సహాయకులు సాహితీ, శ్రీవాణి, అఖిల్, రైతులు పాల్గొన్నారు.

పొలంబడిపై రైతులకు అవగాహన కల్పించాలి

కొత్తపల్లి: రైతులకు పొలంబడిపై పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత వీఏఏ, వీహెచ్ఏలదేనని మండల వ్యవసాయ శాఖ అధికారి జోగిరాజు అన్నారు. మండలంలోని నాగులాపల్లి, ఇసుకపల్లిలో మంగళవారం పొలంబడిపై సదస్సు నిర్వహించారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంబడి ముఖ్యోద్దేశం, రైతులకు చేకూరే లబ్ధిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎలుకల వలన పంట దిగుబడి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయ ఈఓగా విజయలక్ష్మి


అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపడుతున్న విజయలక్ష్మి

పెద్దాపురం: ప్రసిద్ధి చెందిన మరిడమ్మ అమ్మవారి ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా కె.విజయలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏసీగా కొనసాగిన సీహెచ్ రామ్మోహనరావు అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయ ఏసీగా బదిలీ కావడంతో, ఇక్కడ విజయలక్ష్మిని ఏసీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2019 నుంచి 2022 వరకు మరిడమ్మ ఆలయ ఈఓగా విధులు నిర్వర్తించిన ఆమె 2022లో రాజమహేంద్రవరం హితకారిణి సమాజానికి ఏసీగా బదిలీ అయ్యారు. అక్కడి నుంచి కాకినాడ ఎంఎస్ఎన్ చారిటీస్ ఈఓగా బదిలీ కాగా, ప్రస్తుతం పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయ రెగ్యులర్ ఏసీగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. స్థానికులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడతానన్నారు.

క్రీడల్లో బచ్చు ఫౌండేషన్ విద్యార్థుల ప్రతిభ


జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సామర్లకోట: స్కూల్ గేమ్స్‌లో భాగంగా సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు మంగళవారం నియోజకవర్గ స్థాయిలో విశేష ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ వివరాలు తెలిపారు. అండర్-14 విభాగం బాలుర ఖోఖోలో ఎం శివ, గౌతం, కామేష్, అండర్-17 విభాగంలో జి.రాకేష్, కబడ్డీ అండర్-14లో డి.రంజిత్, 17 విభాగంలో కె.అభిరామ్, కార్తికరెడ్డి, సాయిసత్య, మనోజ్, సూర్య, అథ్లెటిక్స్ అండర్-14లో 400 మీటర్ల పరుగులో అంజనేయరెడ్డి ఎంపికయ్యారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి


ఓపెన్ స్కూల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్టేట్ కో-ఆర్డినేటర్, ఎంఈఓలు

సామర్లకోట: వివిధ కారణాలతో చదువును మధ్యలో నిలిపివేసిన వారి కోసం నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య అన్నారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం ఓపెన్ స్కూల్ స్టేట్ కో-ఆర్డినేటర్ ఎం శ్రీనివాసు, జిల్లా కో-ఆర్డినేటర్ పి.సాయి వెంకటరమణ, స్థానిక కో-ఆర్డినేటర్ తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓపెన్ స్కూల్‌లో చేరడానికి ఈ నెల 28 వరకు అవకాశం ఉందన్నారు. ఓపెన్ స్కూల్ పదో తరగతిలో ఉత్తీర్ణులైన వారు ఇంటర్‌లో చేరే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందుకు ఓ ఏడాది వ్యవధి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలి


సామర్లకోట సీహెచ్‌సీలో కార్యక్రమంపై మాట్లాడుతున్న చైర్‌పర్సన్ తదితరులు

సామర్లకోట: ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. రోగులు వార్డులను, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వాడిన సూదులు, ఇతర వ్యర్థాలు, మెడికల్ కిట్లను జాగ్రత్తగా తరలించాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో తుప్పలు పెరగకుండా చూడాలన్నారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలను, మందులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, ఆస్పత్రి ఇన్‌చార్జి అమల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జవహర్ రాజశేఖర్, ఏఎస్ఓ శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ నాయకుడు గంగిరెడ్డి కృష్ణమూర్తి, ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


← సామర్లకోట ఆస్పత్రిలో రోగులకు ఇచ్చిన మందులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ అరుణ

ఏమార్చడానికే ప్రసాదం కల్తీ డ్రామా


మీడియాతో మాట్లాడుతున్న వంగా గీత

మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి నేతలు తాము ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, వాటి నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే తిరుపతి ప్రసాదం కల్తీ అని డ్రామాలు ఆడుతున్నారని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. ఆమె మంగళవారం పిఠాపురంలో విలేకర్లతో మాట్లాడారు. నిజంగా తిరుపతి వేంకటేశ్వర స్వామి వారి ప్రసాదం నేతిలో కల్తీ జరిగితే.. దేవస్థానం అధికారులు ఆ విషయాన్ని బయటపెట్టాలన్నారు. అంతేకానీ ఒక పార్టీ మీటింగ్‌లో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి చెప్పడం వెనుక కుట్ర దాగి ఉందని అర్థమవుతోందన్నారు. ప్రసాదంలో కల్తీ జరిగితే వెంటనే విచారణ జరిపించాల్సింది పోయి, భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా ప్రచారం చేయడానికే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని విమర్శించారు. ఇదంతా చూస్తుంటే ఒక సంచలన విషయాన్ని బయటపెట్టి ప్రజల్లో చర్చ జరిగేలా చేయడం ద్వారా, తామిచ్చిన హామీలు వంద రోజులు పూర్తయినా ఏమి చేయలేకపోయామన్న విషయాన్ని పక్కకు వెళ్లేలా చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. కేవలం స్వలాభం కోసం కూటమి నేతలు వేంకటేశ్వర స్వామిని అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడం అన్యాయమని, క్షమించరాని నేరమన్నారు. ఒకవేళ నిజంగా అలాంటిది జరిగి ఉంటే, ప్రస్తుతం అధికారంలో ఉన్న వారు ఎటువంటి విచారణనైనా జరిపించి నిజాన్ని నిగ్గు తేల్చి, అప్పుడు ప్రజల్లో పెట్టాలని, ఏ విధమైన నిజం లేకుండానే, ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని తెరపైకి తీసుకురావడం టీడీపీ నేతల కుట్రగా ఆమె అభివర్ణించారు. లడ్డూలో నెయ్యి కల్తీ జరిగినట్టు, జరగనట్టు రకరకాల రిపోర్టులు బయట పెడుతున్నారని, ఇందులో ఏదీ నిజమనేది పూర్తి ఆధారాలతో ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేకపోతోందని ప్రశ్నించారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుమల ఆలయంపై దుష్ప్రచారం చేయడం కేవలం భక్తుల మనోభావాలను దెబ్బతీసి, తద్వారా లబ్ధి పొందాలన్న దురుద్దేశమేనన్నారు. జగన్‌పై కోపం ఉంటే, ఆయనను ఎదుర్కోవడానికి వేరే రకంగా ప్రయత్నించాలి కానీ, దేవుడిని అడ్డు పెట్టుకుని జగన్‌ను ఇబ్బంది పెట్టాలని చూడొద్దన్నారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.

పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి

ఎమ్మెల్యే రాజప్ప


ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీలు

సామర్లకోట: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఎంతో బాధ్యతతో కూడుకున్నదని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని గౌరవించుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని మంగళవారం రాత్రి మండల పరిషత్ కార్యాలయంలో సత్కరించారు. 2023-24, 2024-25ల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కేబీఆర్ బలరాంచౌదరి, అద్దంకి వెంకన్నబాబు, టీవీవీ సత్యనారాయణ, పి.నాగమణి, కె.విద్యావాణి, బీఎస్ఎన్ మూర్తి, విశ్రాంత ఉపాధ్యాయులు డి.సూర్యకుమారి, ఎం త్రిమూర్తులు, ఎస్వీ రామారెడ్డి, ఎంఈఓలు వై శివరామకృష్ణయ్య, పి. పుల్లయ్యను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుడు లేకపోతే మానవ జీవితానికి మనుగడ లేదన్నారు. ఎమ్మెల్యేతో పాటు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి : ప్రజాప్రతినిధులు అందరూ అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే రాజప్ప అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పి.వేమవరం గ్రామంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్నికల వరకు రాజకీయ పార్టీలని, ఆ తర్వాత అందరూ ప్రజల కోసం పని చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎంపీడీఓ డి.శ్రీలలిత అధ్యక్షత వహించారు. మండల ప్రత్యేకాధికారి రాధాకృష్ణ, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, సర్పంచ్ ఎలిశెట్టి నూకరత్నం, పంచాయతీ కార్యదర్శి బుల్లియ్యకాపు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

సామర్లకోట: చిన్నారుల నుంచి బాలింతల వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగ అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం బ్రౌన్‌పేట సెక్టార్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సూచించారు. గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. తక్కువ ఖర్చుతో లభించే పోషక విలువలు కలిగిన ఆహారంపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ సభ్యురాలిగా పద్మజ



సామర్లకోట: రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ సభ్యురాలిగా తుమ్మల పద్మజ నియమితులయ్యారు. పెద్దాపురం నియోజకవర్గంలోని పులిమేరు గ్రామానికి చెందిన ఆమె నియోజకవర్గ కన్వీనర్‌గా, మహిళామోర్చా రాష్ట్ర సభ్యురాలిగా వ్యవహరించారు. నామినేటెడ్ పదవుల నియామకంలో భాగంగా ఆమెకు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో సభ్యురాలిగా పదవి లభించింది.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


రైల్వే క్వార్టర్సులో అవగాహన కల్పిస్తున్న స్టేషన్ మేనేజర్ రమేష్

సామర్లకోట: ఆరోగ్యంగా ఉండడానికి పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే కార్వర్సును శుభ్రం చేయించారు. రైల్వే కార్టర్సు ఆవరణ శుభ్రంగా ఉంచటంతో పాటు, డ్రైన్లలో చెత్త వేయకుండా జాగ్రత్త పడాలన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు పెరిగి అంటు వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. రైల్వే ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్యుడు, సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైల్వే కుటుంబాల వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమ కరపత్రాలను ఇంటింటా అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, బుకింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాసు, టిక్కెట్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి

సామర్లకోట: రైతులందరూ ఒకేసారి సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని పాటించడం ద్వారా పంట నష్టం నివారించడానికి అవకాశం ఉంటుందని పెద్దాపురం ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ ఎ.సీతారామశర్మ అన్నారు. కాపవరం గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా సామూహిక ఎలుక నిర్మూలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వరి పంట పాలు పోసుకొనే సమయంలో ఎలుకల బెడద ఎక్కువగా ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖలు సంయుక్తంగా చర్యలు చేపడతాయన్నారు. ఎంఏఓ ఐ.సత్య, సర్పంచ్ కుంచం మాధవరావు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో పొలం పిలుస్తోంది

పిఠాపురం: ప్రతి నెలా మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కేవీవీ సత్యనారాయణ రైతులకు సూచించారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం గొల్లప్రోలు మండలంలో వివిధ శాఖల అధికారులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పశు వైద్యాధికారి ఆర్.హిమజ, పట్టు పరిశ్రమ టెక్నికల్ ఆఫీసర్ ఎస్.ధర్మరాజు, పద్మావతి, అగ్రికల్చర్ మార్కెటింగ్ నుంచి ఎస్.రాంబాబు, ఏవీవీ రమణ పాల్గొన్నారు.

సినిమాలు

లలిత 1 35
లలిత 2: గొర్రె పురాణం, ఉత్సవం
వీరభద్ర: మత్తు వదలరా 2
శోభ: మిస్టర్ బచ్చన్
సామర్లకోట:
విఘ్నేశ్వరా: మత్తు వదలరా 2
అనుశ్రీ 1: భలే ఉన్నాడే
అనుశ్రీ 2: సరిపోదా శనివారం